క్లుప్తంగా

డిచ్‌పల్లి తహసీల్దార్‌గా సతీశ్‌రెడ్డి



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు, సిబ్బంది

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి నూతన తహసీల్దార్ గా కె సతీశ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు తహసీల్దార్‌గా పని చేసిన ప్రభాకర్ నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉన్నతాధికారులు డిచ్‌పల్లి తహసీల్దార్‌గా సతీశ్‌రెడ్డి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి ద్వారా ప్రతి గ్రామంలో భూముల సర్వేను పక్కాగా నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సంతోష్, ప్రభు, సీనియర్ అసిస్టెంట్ అశ్వక్, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాంపూర్‌లో దంత వైద్య శిబిరం



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇందల్వాయి: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సూర్య ఆరోగ్య సంస్థ, మొబైల్ ఐసీటీసీ, మేఘన డెంటల్ కాలేజ్ ఆధ్వర్యంలో రాంపూర్ గ్రామంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు దంత సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రం వైద్యుడు సుశాంత్ రెడ్డి, హెచ్ఈవో శంకర్, సూర్య హెల్త్ కోఆర్డినేటర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్‌కేఎస్ రాష్ట్ర కమిటీ ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏఐఎస్‌కేఎస్ రాష్ట్ర నూతన కమిటీని నేషనల్ సెక్రెటరీ కర్నాల్ సింగ్ ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా యార్లగడ్డ సాయిబాబా, కార్యదర్శి కె శివాజీ, సహాయ కార్యదర్శిగా లక్ష్మి హనుమాన్‌పటేల్, ఉపాధ్యక్షులుగా మోహన్‌రావు, దాస్ కుమార్, కమిటీ సభ్యులుగా సంజు, భాస్కర్, సుధీర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కర్నాల్ సింగ్ మాట్లాడుతూ.. నిజాం షుగర్ ఫ్యాక్టరీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పసుపు రైతుల సమస్యలపై ప్రభుత్వాలపై పోరాటాలు ఉద్యమాలు చేస్తామన్నారు. భవిష్యత్తులో రైతుల సమస్యలపై పోరాటాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

జూన్ 1న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నిజామాబాద్‌నాగారం: పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు తోట రాజశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. పదిలో 550, ఇంటర్‌లో 950, సీబీఎస్ఈలో 450కు పైగా మార్కులు, ఈఏపీసెట్ ఎంసెట్‌లో 2000 ర్యాంకు లోపల సాధించిన వారు అర్హులన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు తమ పేర్లను జిల్లా కమిటీకి అందజేయాలన్నారు. ప్రతిభా పురస్కారాలను జూన్ 1న జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ లో ఉన్న మున్నూరు కాపు కల్యాణ మండపంలో అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9440815010, 9440533422, 9849004942 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పర్యావరణంపై అవగాహన



ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే స్టేషన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దీప మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ఉద్యోగులు, ప్రయాణికులు కృషి చేయాలని కోరారు. మొదటిరోజు పర్యావరణ ప్రాముఖ్యతపై రైల్వే ఉద్యోగులు, ప్రయాణికుల అవగాహన కల్పించారు. సంతకాల సేకరణ, సెల్ఫీ బూత్, ర్యాలీ, పర్యావరణ పరిరక్షణకై తాము కృషి చేస్తామని రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాలు జూన్ 5 వరకు కొనసాగుతాయని తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రేమసాగర్, స్టేషన్ మేనేజర్ సదా శివుడు, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇందూరులో అకాల వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పారిశుధ్య సిబ్బందిని అప్రమత్తం చేసిన కమిషనర్





అర్సపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ దిలీప్‌కుమార్

నిజామాబాద్ సిటీ: అకాల వర్షాలకు ఇందూరు నగరం తడిసి ముద్దయింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నగరంలోని పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలోని పలు డ్రెయినేజీలు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. గురువారం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. సర్కిల్-4 లోని దుబ్బ, గౌతంనగర్, కొత్త కలెక్టరేట్, అర్సపల్లి, మాలపల్లి, ఆటోనగర్, అహ్మద్‌పుర కాలనీ, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. డి-52, డి-54లో చెత్తను జేసీబీలతో క్లీన్ చేయించారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయి నీటి ప్రవాహానికి అంతరాయం కలిగిన చోట్ల వెంటనే జేసీబీలతో శుభ్రం చేయించారు. నాలాలు, పెద్ద డ్రెయినేజీల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, ప్రశాంత్‌కు సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఈఈ మురళీ మోహన్‌రెడ్డి, డీఈలు సుదర్శన్‌రెడ్డి, ముస్తాక్ అహ్మద్, ఏఈ భూమేశ్వర్, ఏఎంసీ జయకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, శ్రీకాంత్, మహిపాల్ ఉన్నారు.

సమస్యల వలయంలో వీరభద్ర కాలనీ

- చిన్నపాటి వర్షానికే రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు



వీరభద్రకాలనీలోని ఖాళీ స్థలంలో వర్షపు నీరు



మట్టిరోడ్డుపై నిలిచిన వర్షపునీరు

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వీరభద్ర కాలనీలో అనేక సమస్యలు నెలకొన్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రూరల్ మండలం గూపన్‌పల్లి పరిధిలోని వీరభద్రా కాలనీ చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. కాలనీలో మురుగు నీరు రోడ్డుపైకి చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా కాలనీలో అనేక సమస్యలు నెలకొన్నాయి. చీకటి పడితే విష పురుగులు ఇళ్లలోకి చేరుతున్నాయి. వరా మురుగు కాలనీ ఖాళీ ప్రదేశాల్లో చేరడంతో దుర్వాసన వస్తోంది. కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారు.

డ్రెయినేజీలు లేక ఇబ్బందులు

సరైన డ్రెయినేజీలు లేవు. చిన్నపాటి వర్షానికే మురుగు నీరు కాలనీలో ప్రవహిస్తోంది. వాటిని పరిశుభ్ర పర్చడానికి పారిశుధ్య కార్మికులు రావడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వర్షకాలం ప్రారంభం కాకముందే కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధికారులు చొరవ తీసుకోవాలి



కాలనీలో డ్రెయినేజీలు సరిగా లేవు. చిన్నపాటి వర్షానికి మురుగునీరు కాలనీల్లోని ఖాళీ ప్రదేశాల్లోకి ప్రవహిస్తోంది. అధికారులు చొరవ తీసుకుని వర్షపు నీరు కాలనీలోకి రాకుండా చూడాలి

– విజయ్, కాలనీవాసి

భయాందోళనలో కాలనీ వాసులు



రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కాలనీ మొత్తం నీటితో జలమయమైంది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీ సమ్యలను పరిష్కరించాలి

–వేణుగోపాల్, కాలనీ వాసి

యువతకు స్ఫూర్తి హనుమంతుడు



ఆలయంలో పూజలు చేస్తున్న బ్రాహ్మణ ప్రతినిధులు

నిజామాబాద్ రూరల్: యువత రామ బంటు ఆంజనేయస్వామిని ఆదర్శంగా తీసుకుని జీవన ముక్తిని పొందాలని వక్తలు అన్నారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఇందూరు అర్చక పురోహితుల సమాఖ్య ఆధ్వర్యంలో గాజుల్‌పేట సంతాచారి మఠం ప్రాంగణంలోని హనుమాన్ మందిరంలో శ్రీ రామ రక్ష స్తోత్రము, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హనుమాన్ జయంతి ప్రాముఖ్యతను వేద పండితులు పశుపతి శర్మ భక్తులకు వివరించారు. రామాయణంలో హనుమాన్ కీలక పాత్ర పోషించారని నాటి త్రేతాయుగం నుంచి నేటి కలి యుగం వరకు హనుమాన్ ఎంతో మంది భక్తులకు ఆరాధ్య దైవం అయ్యారన్నారు. కార్యక్రమంలో నూతుపల్లి శ్రీనివాస్ శర్మ, రామకృష్ణ శర్మ, చంద్రశేఖర శర్మ, ప్రవీణ్, మిలింద్, వైరగర్కర్ రామ నాథ్, ప్రశాంత్ జోషి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీచర్స్ ట్రైనింగ్



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం గురువారం కొనసాగింది. శిక్షణా కేంద్రాన్ని డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పరిశీలించారు. గణితం, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ శిక్షణను పరిశీలించి పలు సూచనలు చేశారు. గణితం విద్యార్థికి సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించాలని, గణితంపై ఇష్టం పెంచుకునే విధంగా బోధన చేపట్టాలన్నారు. అలాగే సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులతో మాట్లాడి కోర్సు జరుగుతున్న విధానాన్ని తెలుసుకున్నారు. ఏఎంవో బాలకృష్ణ సెంటర్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. రెండో స్పెల్‌లో గణితం, సాంఘికశాస్త్రం కలిపి 320 మంది ఉపాధ్యాయుల శిక్షణ పొందుతున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి శంకర్ తెలిపారు.

సీఐటీయూలో కార్మికుల చేరిక



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లోని వాటర్ వర్క్స్, ఇంజినీరింగ్ విభాగాల కార్మికులు జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో సీఐటీయూలో చేరారు. గురువారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడుతూ.. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. అనంతరం సీఐటీయూలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో భూపతి, కటారి రాములు, హరీశ్, సహదేవ్, బాబు, లక్ష్మణ్, నితిన్, రోహిత్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

డిచ్‌పల్లి: మండలంలోని దూస్‌గాం బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు ఎండీ సాజిద్ కుటుంబాన్ని గురువారం పార్టీ రూరల్ ఇన్‌చార్జి, ధర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ పరామర్శించారు. ఇటీవల సాజిద్ నాయనమ్మ యాసిన్‌బీ అనారోగ్యంతో మృతి చెందారు. సాజిద్ ను పరామర్శించిన జగన్ తన సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట నాయకులు శక్కరికొండ కృష్ణ, దాసరి లక్ష్మీ నర్సయ్య, నడిపన్న, ఒడ్డెం నర్సయ్య, యూసుఫ్, సతీశ్‌రెడ్డి, రవిగౌడ్, లింబాద్రి, సుమన్, సాయన్న, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నేషనల్ శిక్ష రత్న అవార్డుకి ఎంపికైన ఉపాధ్యాయులు



అంకం నరేశ్

నిజామాబాద్ అర్బన్: జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు నేషనల్ శిక్ష రత్న అవార్డుకి ఎంపికయ్యారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన నేషనల్ ఎడ్యుకేషనల్ శిక్ష రత్న అవార్డుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 30 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా అ ందులో తెలంగాణ నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో జిల్లా నుంచి ధర్పల్లి మండలం రేకులపల్లి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అంకం నరేశ్, మెండోరా మండలం బుస్సాపూర్ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం డి రాజారాం ఎంపికైన వారిలో ఉన్నారు. విద్యా బోధనతో పాటు వివిధ పరికరాల తయారీ, బోధనలో నూతన పద్ధతులు అవలంబించడం వంటి అంశాలలో వీరు చేపట్టిన విద్యను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలించిన స్వచ్ఛంద సంస్థ వారు ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

తడిసిన ధాన్యం తరలింపు

ఆర్మూర్‌టౌన్: కురుస్తున్న వర్షాలకు రైతులు పండించిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. గురువారం ఉదయం అధికారులు ఆలూర్ బై పాస్ రోడ్డు వద్ద తడిసిన ధాన్యాన్ని లారీల్లో ఎక్కించి రైస్‌మిల్‌కు తరలించారు. మరో వారం రోజుల పాటు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలుపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డుపై చెట్టు తొలగింపు



చెట్టును తొలగిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. నగరంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న వేప చెట్టు గురువారం రాత్రి వర్షానికి రోడ్‌పై పడిపోవడంతో ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో జేసీబీతో తొలగించారు. వాహనాలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కేశవ్, కానిస్టేబుళ్లు ఉదయ్, రమేశ్, ప్రసాద్ ఉన్నారు.

సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

ఖలీల్‌వాడి: నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట సర్టిఫికెట్లు పోగొట్టుకున్న పొతంగల్ మండల కేంద్రానికి చెందిన కళ్యాణికి ట్రాఫిక్ కానిస్టేబుల్ గురువారం వాటిని అందజేశారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ బైక్‌పై వస్తుండగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సర్టిఫికెట్లు లభించాయి. అందులో ఉన్న సెల్‌ఫోన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఆమె జిల్లా కేంద్రానికి రావడంతో సర్టిఫికెట్లను కళ్యాణికి అందించారు. కానిస్టేబుల్‌కు కళ్యాణి కృతజ్ఞతలు తెలిపారు.

బూటకపు ఎన్‌కౌంటర్‌పై విచారణ చేపట్టాలి

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు 27 మంది ఆదివాసీలను ఆపరేషన్ కగార్ పేరుతో హతమార్చిందని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ చేపట్టాలని ఐక్య వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్, న్యూడెమోక్రసీ, బహుజన సమాజ్‌పార్టీ, పౌరహక్కుల సంఘం, మావన హక్కుల వేదికలు సంయుక్తంగా నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. ఈనెల 21న ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా మూడ్ అడవుల్లో కేంద్ర బలగాలు మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును చంపివేశారన్నారు. ఇది రాజ్యం చేసిన హత్యగా పరిగణించాలన్నారు. అటవీప్రాంతంలో నివసిస్తున్న అమాయక గిరిజనులను అక్కడి నుంచి తరలించే పనిలో భాగమే ఈ ఆపరేషన్ కగార్ అన్నారు. ఇకనైనా ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వనమాల కృష్ణ, ఆకుల పాపయ్య, రమేశ్‌బాబు, ఓమయ్య, వాల్గోట రవీందర్, వేల్పూరు భూమయ్య, డాక్టర్ పిట్ల సరిత తదితరలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



నడిపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

డిచ్‌పల్లి: వర్షాలు కురుస్తున్నందున అన్ని గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిచ్‌పల్లి ఎంపీడీవో బుక్య లింగం నాయక్ సూచించారు. గురువారం డిచ్‌పల్లి మండలం నడిపల్లి, ధర్మారం(బి) జీపీలను ఎంపీడీవో పరిశీలించారు. ఆయా కార్యాలయాల్లో హాజరు రిజిస్టర్‌తో పాటు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వచ్చే నెలలో ప్రారంభం కానున్న హరితహారం కార్యక్రమంపై దృష్టి సారించాలని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పన్ను వసూళ్లు చేయాలని పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణకు సూచించారు. నడిపల్లి మేజర్ గ్రామపంచాయతీ రెగ్యులర్ కార్యదర్శి లేకున్నా, ఇన్‌చార్జి కార్యదర్శి రాధిక ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ రజత్‌కుమార్, కారోబార్లు సంతోష్, రాము, సిబ్బంది నర్సయ్య, బాబా తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ఎంపీడీవో అభినందించారు.

పుష్కర స్నానం ఆచరించిన ఎమ్మెల్యే దంపతులు



పుష్కర స్నానం చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే దంపతులు



పుష్కర స్నానం చేస్తున్న రైతు కమిషన్ సభ్యులు

సుభాష్‌నగర్: కాళేశ్వరం త్రివేణి సంగమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, తన సతీమణి మణిమాలతో కలిసి గురువారం సరస్వతీ పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని, సరస్వతీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద సరస్వతి పుష్కర స్నానం ఆచరించడం తన అదృష్టమన్నారు. సరస్వతి పుష్కరాలకు పెద్ద ఎత్తున తరలి వస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట బీజేపీ నాయకులు, బంధుమిత్రులు ఉన్నారు.

పుష్కర స్నానం చేసిన రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు సరస్వతీ పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర దర్శనం చేసుకున్నారు. గురువారం ఉదయం 6 గంటలకు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితోపాటు గడుగు గంగాధర్ ఇతర సభ్యులు స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం పొందారు.

'హరిదా' సాహిత్య సేవలు అభినందనీయం



డాక్టర్ సిద్ధంకి యాదగిరిని సన్మానిస్తున్న కవులు

నిజామాబాద్ రూరల్: తెలంగాణ సాహిత్య యవనికపై హరిదా రచయితల సంఘం చేస్తున్న కృషి, సాహిత్య సేవలు అభినందనీయమని ప్రముఖ కవి మంజీరా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సిద్ధంకి యాదగిరి అన్నారు. ఆయన జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా గురువారం సుభాష్ నగర్‌లోని బాయిస్ కాన్వెంట్‌లో జరిగిన కార్యక్రమంలో హరిదా రచయితల సంఘం పక్షాన అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ ఆత్మీయంగా సన్మానించారు. తెలంగాణ భాషలో తొలిసారిగా కవితా రచన, కథారచన పోటీలు నిర్వహించడం హరిదా రచయితల సంఘానికే చెల్లిందని అభినందించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో జన్మించిన హరిదా సంఘం ఆధ్వర్యంలో జిల్లా రచయితలు చేసిన పోరాటం ఆదర్శనీయమని అన్నారు. ప్రజా చైతన్యమే పరమావధిగా రచయితలు సాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, డాక్టర్ గంట్యాల ప్రసాద్, యు శ్రీనివాస్ గౌడ్, ఉమారాణి, సునంద, రమణి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

ఎడపల్లి: వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని రైతులకు రుద్రూర్ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూ చించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఎడపల్లి మండలం పోచారం జీపీ కార్యాలయంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త సాయిచరణ్ మాట్లాడుతూ.. పొలంలో కీటకాల ఉధృతి పరిమిత స్థాయిని దాటినప్పుడు మాత్రమే రసాయన మందులు వినియోగించాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రశాంతి మాట్లాడుతూ.. పంటకి సాగునీరు అవసరం మేరకు అందించాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు. ఏవో సిద్ది రమేశ్వర్ మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా వేసవి దుక్కులు చేసుకోవాలని, జనుము, జీలుగ వంటి పంటలను వరి పంటకు ముందు సాగు చేయాలన్నారు. పశు వైద్యాధికారి ప్రమోద్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ మహేందర్ రైతులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	40	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	150	200	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	30	50
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	35	60
కొత్తిమీర	60	80	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	90	మామిడికాయ	40	60

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 ఏస్(తెలుగు)-1.30, 7.35
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.30, 10.30
స్క్రీన్-2 ఒక బృందావనం(తెలుగు)-11.00
నిశ్శబ్ద ప్రేమ(తెలుగు)-4.30
సింగిల్(తెలుగు)-1.30, 7.30, 10.30
స్క్రీన్-3 ఒక బృందావనం(తెలుగు)-4.30, 10.20
లిలో అండ్ స్టిచ్(ఇంగ్లీష్ 3డీ)-1.30 , 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 మిషన్ ఇంపాజిబుల్ -10.10, .25, 10.40
సింగిల్(తెలుగు)-1.40, 7.55
స్క్రీన్-2 లిలో అండ్ స్టిచ్(3డీ తెలుగు)-11.30,2.00
ఏస్(తెలుగు)-4.30, 10.20
ఒక బృందావనం(తెలుగు)-7.40
స్క్రీన్-3 భూల్ చుక్ మాఫ్(హిందీ)-11.35, 8.00, 10.40
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(తెలుగు)-2.15
హిట్(తెలుగు)-4.45
స్క్రీన్ -4 వీరరాజు-1991(తెలుగు)-11.00
వర్షం(తెలుగు)-1.40 -శుభం(తెలుగు)-7.30
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(ఇంగ్లీష్)-5.00, 10.10
లలితామహల్ యమదొంగ దేవి సింగిల్
నటరాజ్ మిషన్ ఇంపాజిబుల్ విజయ్ హిట్